RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 282 | సంపుటి 4 | మంగళవారం | 14-07-2026 | పేజీలు 4 | వెల 3/-

## 'పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా'

–వేం నరేందర్ రెడ్డి



# కేసముద్రం గడ్డపై 'వేం' ముద్ర!

- 30 సంవత్సరాల కల నెరవేరిన వేళ
- భావోద్వేగానికి లోనైన సీఎం ముఖ్య సలహాదారులు
- కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఫైర్ స్టేషన్, డీసీసీబీ బ్యాంక్ ప్రారంభం
- దశాబ్దాల నిరీక్షణకు తెర.. నియోజకవర్గ అభివృద్ధిలో సరికొత్త అధ్యాయం

**మూడు దశాబ్దాలుగా కేసముద్రం ప్రజలు ఎదురుచూస్తున్న రెండు కీలక సదుపాయాలు ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఫైర్ స్టేషన్, డీసీసీబీ బ్యాంక్ శాఖలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని పేర్కొన్న ఆయన, కేసముద్రాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు.**

కేసముద్రం, జులై 13(ప్రభాత గమనం):

ఆ ప్రాంత ప్రజల మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఒక మహత్తర ఆశయం నెరవేరిన వేళ.. కేసముద్రం గడ్డ సరికొత్త చరిత్రకు వేదికైంది. ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారులు, ఈ ప్రాంత ముద్దుబిడ్డ వేం నరేందర్ రెడ్డి చొరవతో కేసముద్రం నూతన శోభను సంతరించుకుంది. సోమవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ స్టేషన్ (అగ్నిమాపక కేంద్రం) మరియు డీసీసీబీ బ్యాంక్ బ్రాంచ్ ను ఆయన రిబ్బన్ కట్ చేసి అత్యంత వైభవంగా ప్రారంభించారు.గత 30 ఏళ్లుగా కేసముద్రం పరిసర ప్రాంత ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు నేటితో శాశ్వత పరిష్కారం లభించింది. ప్రమాదవశాత్తు ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే.. పక్కనే ఉన్న పట్టణాల నుండి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి సర్వస్వం బూడిదయ్యే పరిస్థితి ఉండేది. ఈ బాధలను స్వయంగా చూసిన వేం నరేందర్ రెడ్డి, పట్టుబట్టి కేసముద్రానికి ఫైర్ స్టేషన్‌ను మంజూరు చేయించడమే కాకుండా, రికార్డు సమ యంలో దానిని అందుబాటులోకి తెచ్చి తన ప్రత్యేకతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కొంత భావోద్వేగానికి లోనయ్యారు.

### రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతా..

"నేను ఈ స్థాయికి రావడానికి కారణం నా పుట్టిన గడ్డ, నన్ను ఆశీర్వదించిన ఇక్కడి ప్రజలే. నా శ్వాస ఉన్నంతవరకు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఉంటా. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకే నా శీర్షసన ప్రయాణం. కేసముద్రం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఈ రోజు ప్రారంభించుకున్న ఫైర్ స్టేషన్, డీసీసీబీ బ్యాంక్‌లు కేవలం ప్రారంభం మాత్రమే.. మిగతా 2లో..

## 2027 చివరి నాటికి దేవాదుల పూర్తి

- పనుల వేగవంతానికి రూ.146 కోట్ల విడుదల
- దేవాదుల పంపులు 24 గంటలూ నడపాలి
- కాళేశ్వరం పనులు ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాల మేరకే
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో వర్షా భావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాగునీరు, సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరిలో ప్రవాహం ఉన్న ప్రతి సందర్భాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాజెక్టులోని అన్ని పంపులను 24 గంటల పాటు నిరంతరం నిర్వహిస్తూ 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపాలని సూచించారు.




## బాలికపై లైంగిక దాడి

- పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్
- పెళ్లి పేరుతో మోసం.. బలవంతంగా గర్భస్రావం
- నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం :మామునూరు ఏసీపీ వెంకటేష్






# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న 'సుప్రీం'

న్యూదిల్లీ,ప్రభాత గమనం, జూలై13: పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరసత్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సావిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీయులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.



# పతకాలు సాధించిన క్రీడాకారులకు ఎస్పీ అభినందనలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఇటీవల నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్ స్పోర్ట్స్ మీట్–2026 కాళేశ్వరం జోన్ తరపున విశిష్ట ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖకు చెందిన 25 మంది పోలీస్ క్రీడాకారులను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ పోటీల్లో భూపాలపల్లి జిల్లా పోలీసులు 3 బంగారు, 10 వెండి, 12 కాంస్య పతకాలతో మొత్తం 25 పతకాలు సాధించి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ శాఖకు విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలు సాధించడం ప్రతి పోలీస్ అధికారికి, సిబ్బందికి గర్వకారణమని అన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు క్రీడల్లోనూ రాణించడం పోలీస్ సిబ్బంది శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో యోగా విభాగంలో మొత్తం 20 పతకాలు సాధించడంలో క్రీడాకారులను సమర్థవంతంగా తీర్చిదిద్దిన కాటారం డీఎస్పీ రైటర్, యోగా కోచ్ మధును జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలను ప్రశంసించారు.

# హంతకుడు రాజ్ కుమార్ మృతి

- ఆరుగురి హత్య కేసులో ప్రధాన నిందితుడు
- పోలీసులకు భయపడి విషం తాగి ఆత్మహత్య

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురితో పాటు మొత్తం ఆరుగురిని అతి దారుణంగా కత్తితో నరికి చంపిన కేసులో ప్రధాన నిందితుడు జెల్లా రాజ్ కుమార్ (32) శవమై తేలాడు. సోమవారం కొత్తూరు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతుడు ఆరుగురిని పొట్టనబెట్టుకున్న రాజ్ కుమార్ అని నిర్ధారించారు. లొంగిపోవడం ఇష్టం లేక, పోలీసుల వేట తీవ్రం కా వడంతో అతడు విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు.

### పోక్సో కక్షతోనే ఘాతుకం..

దైవాలగూడకు చెందిన రాజకుమార్ గతంలో ఓ మైనర్ బాలికను వేధించినందుకు పోక్సో కేసు నమోదైంది. ఈ కక్షతోనే సదరు మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మి , నాయనమ్మ రుక్మిమ్మలను రాజకుమార్ దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత తన గుట్టు రట్టవుతుందనే భయంతో, తనను అడ్డుకుంటారనే కోపంతో కట్టుకున్న భార్య, ఇద్దరు అమాయక కుమారులను కూడా కత్తితో నరికి చంపి పరారయ్యాడు. ఒకే రోజు ఆరుగురిని బలితీసుకున్న ఈ నరరూప రాక్షసుడి అంతంపై స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# కేసముద్రం గడ్డపై 'వేం' ముద్ర!

## మొదటి పేజీ తరువాయి..

రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ఈ గడ్డపై కురుస్తాయి." అని ఆయన స్పష్టం చేశారు.వ్యవసాయ మార్కెట్ యార్డులోనే డీసీసీబీ బ్యాంక్‌ను ప్రారంభించడం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. రైతులకు పంట రుణాలు, ఆర్థిక లావాదేవీలు ఇకపై మరింత సులభతరం కానున్నాయి. మార్కెట్‌కు వచ్చే ప్రతి రైతుకు ఈ బ్యాంక్ కొండంత అండగా నిలుస్తుందని నరేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.వేం నరేందర్ రెడ్డి రాకతో కేసముద్రం నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ తోరణాలతో, భారీ ఫ్లెక్సీలతో పండుగ వాతావరణాన్ని తలపించింది. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, రైతులు ఆయనకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. 30 ఏళ్ల కలను సాకారం చేసిన 'అభివృద్ధి ప్రదాత' వేం నరేందర్ రెడ్డి అంటూ ప్రజలు జేజేలు కొట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతాంగం పాల్గొన్నారు."

### 'వేం' విజన్ సూపర్!"

కేసముద్రం చరిత్రలో ఈ రోజును ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా స్థానికులు అభివర్ణిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫైర్ స్టేషన్‌ను తీసుకువచ్చిన వేం నరేందర్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. లీడర్ అంటే కేవలం హామీలు ఇవ్వడం కాదు.. వాటిని నెరవేర్చి చూపించడం అని ఆయన మరోసారి నిరూపించారు. ఈ కార్యక్రమంలో హబూబాబాద్ పార్లమెంటు సభ్యులు



పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, స్టేట్ ఫైర్ డిజి విక్రం సింగ్ మాన్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,ఇంచార్జ్ అదనపు స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఉమా, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత,వైస్ చైర్మన్ అల్లం రమ, మహేందర్ రెడ్డి,అల్లం నాగేశ్వరరావు,నీలం దుర్గేష్,సమ్మి గౌడ్,జిల్లా ఫైర్ అధికారి శ్రీనాథ్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి,డిసిసి బ్యాంకు రీజనల్ అధికారి చైతన్య, సీఈవో సుల్తాన, స్థానిక తహసిల్దార్ వివేక్, ఎంపీడీవో క్రాంతి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ (బాలికలు)లో జాతీయ నూలు పురుగుల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని జూనియర్, డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి క్లాస్ రూమ్ లు, కిచెన్, డైనింగ్,హాల్ పరిసరాలను పరిశీలించారు తగు సూచనలు జారీ చేశారు.

# దళితుల అభ్యున్నతికి పాటుపడాలి

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్
- నాగయ్యపల్లిలో సంఘం నూతన కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా మాదాసి నవీన్ ఎన్నిక

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సమాజంలోని అసమానతలపై,దళిత బహుజన సమస్యలపై మహనీయుల బాటలో నిరంతరం పనిచేస్తూ డిబిఎఫ్ కార్యకర్తలు దళితుల అభ్యున్నతికి పాటుపడాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నాగయ్య పల్లిలో జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్ అధ్యక్షతన డిబిఎఫ్ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ మాట్లాడుతూ పీడిత, తాడిత, బహుజన,మహిళల, మైనారిటీ వర్గాల, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గత మూడున్నర దశాబ్దాలుగా డిబిఎఫ్ పనిచేస్తూ ప్రశ్నించే గొంతుకుగా నిలుస్తుందని తెలిపారు.అనంతరం డిబిఎఫ్ నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాదాసి నవీన్, ఉపాధ్యక్షుడిగా మాదాసి సురేందర్, గిన్నారపు




కుమారస్వామి కార్యదర్శిగా సంఫీ ఐలయ్య కమిటీ సభ్యులుగా కోశాధికారిగా మాదాసి కొమరమ్మ కమిటీ సభ్యులుగా మాదాసి కుమారస్వామి, గిన్నారపు సామ్యూల్, మాదాసి రాజేష్, గిన్నారపు ప్రమీల, మాదాసి కవిత, మాదాసి సుమలత తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అసైన్ భూమి సమితి అధ్యక్షుడు మహేందర్, ములుగు జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్ తో పాటు డిబీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు

ఖమ్మం జులై13(ప్రభాత గమనం):
రోడ్లపై కేజ్ వీల్స్ అమర్చిన వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి మండలంలో ఆర్ అండ్ బీ రోడ్డులో కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడుపుతున్నారని, వాటితోనే రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, సంబంధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ కమిషనర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి గ్రామాలకు మెరుగైన రహదారులను నిర్మిస్తోందని, వాటిని సురక్షితంగా ఉంచడం అందరి బాధ్యతని అన్నారు. అదేవిధంగా ట్రాక్టర్ డ్రైవర్లకు, యజమానులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.




# యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ డా.సత్య శారద

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి యూనిఫాం స్టిచ్చింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద చైర్మన్‌గా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) నాగ పద్మజ కన్వీనర్‌గా, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రంగయ్య నాయుడు సహ–కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత శాఖల అధికారులు సభ్యులుగా ఉంటూ యూనిఫాంల కుట్టింపు, నాణ్యత, పంపిణీ తదితర అంశాలను పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ యూనిఫాంల కుట్టింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీబీసీడీవో పుష్పలత అధికారులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డితో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా భేటీ

- ఎస్సీల అభివృద్ధి, విద్యా సంస్కరణలపై విస్తృత చర్చ
- కుల వివక్ష నిర్మూలనకు కీలక చర్యలు చేపట్టాం :సీఎం రేవంత్ రెడ్డి

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రజా భవన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమం, విద్యా రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్



రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వాటిని దశలవారీగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పాఠశాలల్లోనే అందించడంతో పాటు, రవాణా సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోందని వెల్లడించారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో వీలైనన్ని ఎక్కువ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య అందరికీ సమానంగా చేరువ కావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# మంత్రి సురేఖను కలిసిన వరంగల్ సీపీ శ్వేత

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేత సోమవారం హన్మకొండలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందించడంలో విజయవంతం



కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కూడా పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు, శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవల అందింపు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీతనం కలిగిన, పారదర్శకమైన పాలన అందించేందుకు అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

# గ్రామాల భద్రతలో భాగస్వాములు కావాలి

- మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్
- గోపాలపురంలో 'మన ఊరు - మన బాధ్యత' కార్యక్రమం
- హెల్మెట్ బైక్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా ఎస్పీ
- గంజాయి రహిత గ్రామాలే లక్ష్యంగా 'వాల్ ఆఫ్ ప్రామిస్'పై యువత సంతకాలు

**గార్ల, జులై 13 (ప్రభాత గమనం) :**



గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, భద్రతకు గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ అన్నారు. గార్ల మండలం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ యువతతో కలిసి ఆయన హెల్మెట్ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. 'మన ఊరు – మన బాధ్యత' కార్యక్రమం ద్వారా గ్రామాలు స్వచ్ఛందంగా తీసుకుంటున్న నిర్ణయాలు సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలుకుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరి ప్రాణ రక్షణ కోసం గ్రామాల్లో 'నో హెల్మెట్.. నో ఎంట్రీ' నిబంధనను కఠినంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, గంజాయి రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఎస్పీ కోరారు. గ్రామాల్లో భద్రతను పటిష్టం చేసేందుకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్థానిక సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, యువత పోలీస్ శాఖకు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. మహబూబాబాద్ జిల్లాలోని గ్రామాలు తీసుకుంటున్న ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయాలు యావత్ తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎస్పీ డా. శబరీష్ ప్రశంసించారు.కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'వాల్ ఆఫ్... ప్రామిస్' ఫ్రేమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు తాము పూర్తిగా దూరంగా ఉంటామని, తమ గ్రామాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తూ, చట్టాలను గౌరవిస్తామని యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఫ్రేమ్‌పై సంతకాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో చేసిన ఈ ప్రతిజ్ఞను ఎప్పటికీ గుర్తుచేస్తూ, గంజాయి నిర్మూలన పట్ల నిరంతర బాధ్యతను కల్పించేలా ఈ బోర్డును రూపొందించారు. ఈ సందర్భంగా యువత చూపిన సామాజిక చైతన్యాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సంపూర్ణ ఆరోగ్యానికి అల్బెండజోల్ తప్పనిసరి

- ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం నులిపురుగుల నివారణ మాత్ర తప్పనిసరిగా వేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో మెరుగైన ప్రతిభ కనబరచగలరని అన్నారు. పిల్లలు అనారోగ్యానికి గురికావడం వల్ల పాఠశాలకు సక్రమంగా హాజరు కాలేకపోవడం, చదువులో వెనుకబడడం జరుగుతుందని తెలిపారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాహారం సక్రమంగా అందడంతో పాటు పిల్లల ఎదుగుదల, బరువు, ఎత్తు పెరుగుదలకు దోహదపడుతుందని వివరించారు. కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, అందుకే ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రను నమిలి తీసుకోవడం వల్ల ఎలాంటి హానీ ఉండదని, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, భోజనం చేసే ముందు మరియు మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, సమయానికి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమం గురించి తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారికీ అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయగా, విద్యార్థులు వాటిని నమిలి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ రజిత, డాక్టర్ ఎ. శ్రీకృష్ణారావు, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుమా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా, ప్రధానోపాధ్యాయులు రామారావు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ గీత, డెమో వి. అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ములుగు ఎస్పీని కలిసిన ఎస్సై

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



నూతనంగా ములుగు పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ గా నియమితులైన ఎస్ వెంకటేష్ , ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకెన ని ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ములుగులో ఫ్రెండ్లీ పోలీసింగ్ తో పాటు నేరస్తులతో కఠిన వైఖరి ప్రదర్శించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ఉత్తమ పోలీసింగ్ అమలు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనపై ఉంచిన నమ్మకానికి ఉన్నతాధికారులకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.




## ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలి

- రూ.18 వేల వేతన హామీని నెరవేర్చాలి
- గార్ల ఐకేపీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

**గార్ల, జులై 13 (ప్రభాత గమనం) :**

సెర్ప్ సంస్థలో గత 25 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ ధర్నాను ఉద్దేశించి కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఐకేపీ ఉద్యోగులకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక పురోభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. గత కొన్ని నెలల క్రితం రాష్ట్ర యూనియన్ ప్రతినిధులతో సెర్ప్ సీఈఓ చర్చలు జరిపి, స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీఎం కు వినతిపత్రం సమర్పించారు.సెర్ప్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ రూ.10 లక్షల సాధారణ బీమాతో పాటు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి.సెర్ప్ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం గ్రామ సంఘాల నుండి వేతనాలను వెంటనే పెంచాలి.క్షేత్ర స్థాయిలో విధులను సులభతరం చేసేందుకు ప్రతి గ్రామ సంఘానికి ఒక ట్యాబ్ మరియు ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఉచితంగా అందించాలి.ఎలాంటి ఆర్థిక ఆదాయం లేని వెనుకబడిన గ్రామ సంఘాలకు రూ.20 లక్షల ప్రత్యేక నిధిని కేటాయించి ఆదుకోవాలి.ఈ కార్యక్రమంలో ఐకేపీ సంఘం నాయకులు, ప్రతినిధులు చింత మౌనిక, అనిత, చంద్రకల, మనోహర్, రజిని, స్వప్న, ఉమా, లత, అరుణ, కల్పనా, విజయ్ కుమార్, సైదులు వీఓఏలు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన ట్రాఫిక్ పోలీసులకు సన్మానం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




తెలంగాణ 5వ రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో విశిష్ట ప్రతిభ కనబర్చిన వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సోమవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ కె. సుజాత విజేతలకు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ క్రీడా పోటీల్లో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఎస్. అజయ్ బాడీ బిల్డింగ్ విభాగంలో సిల్వర్ మెడల్, రెజ్లింగ్ విభాగంలో రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే వాషి జమునారాణి బాక్సింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ శాఖకు గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోటీతత్వం మరింత పెంపొందుతాయని అన్నారు. ఇలాంటి విజయాలు పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతాయని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు తీసుకురావాలని విజేతలను అభినందించారు. ట్రాఫిక్ సీఐ కె. సుజాత మాట్లాడుతూ, క్రీడల్లో సాధించిన ఈ విజయాలు ఇతర పోలీసు సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని విజేతలను ఘనంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విజేతల విజయంతో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ శాఖలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

## సమస్యలకు తక్షణ పరిష్కారమే ప్రజాదివాస్ లక్ష్యం

**భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 17 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, వాటిపై వెంటనే స్పందించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు లేదా పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



ఆరోగ్య పరిరక్షణలో పోలీస్ క్రీడాకారులు తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఇటీవల మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఐదవ రాష్ట్ర స్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ తొలి క్లస్టర్ పోటీల్లో మొత్తం 61 పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత పతక విజేతలను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరఫున పాల్గొని అత్యధిక పతకాలు సాధించడం గర్వకారణమని అన్నారు. క్రీడాకారుల కృషి, అంకితభావం, క్రమశిక్షణ ఇతర పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోలీసు విధులు ఎంత ఒత్తిడితో కూడుకున్నవైనా, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ వ్యాయామం, క్రీడలు, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వారానికి కనీసం మూడు నుంచి నాలుగు రోజులు కొంత సమయాన్ని కేటాయించి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. క్రీడాకారులు తమ సహచర పోలీస్ సిబ్బందిని కూడా ఆరోగ్య పరిరక్షణ వైపు ప్రోత్సహించి స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన ప్రతి క్రీడాకారుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రతిష్ఠను మరింత పెంచారని, భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, శ్రీనివాస్, బాలస్వామి, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ స్పర్జన్ రాజ్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భరోసా కేంద్రంలో సీపీ తనిఖీ

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సోమవారం రంగంపేటలోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ బాధితులకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించాలని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, లైంగిక వేధింపులు, గృహ హింస వంటి ఘటనల బాధితులకు ఒకే వేదికపై సమగ్ర సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భరోసా కేంద్రం ద్వారా బాధితుల్లో ధైర్యం, నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంలో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, మహిళా పోలీస్ స్టేషన్–1 ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, భరోసా ఎస్ఐ కిరణ్మయి, కౌన్సెలర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## దోపిడీ దొంగల అరెస్టు

- ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసులు
- ద్విచక్రవాహనం, నగదు స్వాధీనం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




హనుమకొండ పెద్దమ్మగడ్డ మోరీ సమీపంలో ఓ వ్యక్తిపై దాడి చేసి రూ.1,700 దోపిడీ చేసిన ముగ్గురు యువకులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. సంగెం మండలం లోహిత గ్రామానికి చెందిన గుగులోత్ సురేందర్, గుగులోత్ శ్రీరామ్, భూక్యా వెంకటేశ్‌లు మద్యం సేవించిన అనంతరం డబ్బుల కోసం ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జూలై 12 తెల్లవారుజామున డీసీఎంలో నిద్రిస్తున్న బాధితుడిపై దాడి చేసి నగదు గుంజుకున్న నిందితులు, అనంతరం అతని యజమానిని ఫోన్‌లో బెదిరించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బస్టాండ్ సమీపంలో వాహన తనిఖీల సమయంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దోపిడీకి ఉపయోగించిన స్కూటీతో పాటు రూ.1,700 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కిషోర్, మరియు సిబ్బందిని సీఐ మచ్చ శివకుమార్ అభినందించారు.



## విద్యార్థుల భద్రతే లక్ష్యం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరిష్, ఆదేశాల మేరకు కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థులు, విద్యార్థినుల భద్రత, చట్టాలపై అవగాహన మరియు సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కురవి ఎస్సై సతీష్ భరోసా కేంద్రం ఎస్ఐ దీపికా రెడ్డి మరియు షీ టీం సిబ్బంది సంయుక్తంగా నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణతో మెలుగుతూ చదువులపై పూర్తి దృష్టి సారించాలని, చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని వివరించారు. సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పిస్తూ, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలను పంచుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.



## పతకాలు సాధించిన పోలీస్ అధికారులకు ఎస్పీ అభినందనలు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పీటీసీ మామూనూర్ లో జూలై 7 నుండి 9 వరకు నిర్వహించిన భద్రాద్రి జోన్– పోలీస్ డ్యూటీ మీట్–2026లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించిన మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, జిల్లాకు కీర్తి తీసుకొచ్చినందుకు ప్రశంసించారు. సాధించిన విజయాలను కొనియాడుతూ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మహబూబాబాద్ జిల్లా తరపున ఓవర్ అల్ ఇంచార్జి గా వ్యయంహరించిన డిఎస్పీ శ్రీనివాస్,ప్రత్యేక బాంబు స్క్వాడ్ కోచ్ గా వ్యవహరించిన అంజయ్య ను ప్రత్యేకంగా అభినందించారు



## ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ

కేసముద్రం జులై 13(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో సోమవారం ప్రభుత్వం చేపట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలు వేయడంతో పాటు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యాభ్యాసంలో మంచి ఫలితాలు సాధించగలరని అన్నారు. నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకున్నారు.

# కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా పాటించాలి

- అన్ని విద్యా సంస్థల్లో కెరియర్ గైడ్ లైన్స్ తరగతులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

కేసముద్రం జులై 13(ప్రభాత గమనం):

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ గురుకుల బాలికల ట్రైబల్ హాస్టల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆల్బెండజోల్ మాత్రలను వేసి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల పిల్లలకు132641 జిల్లాలో గల1437 అంగన్వాడి కేంద్రాల్లో, 13 జూనియర్ కళాశాలలో,1006 ప్రైవేట్, ప్రభుత్వ హై స్కూల్, ప్రైమరీ స్కూళ్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంలు, ఆశాలతో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుంది. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించారు.విద్య భోధన గురించి , కళాశాలలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్య జీవితంలో చాలా ముఖ్యమైనది తెలిపారు.చదువుపై ఆసక్తి, జీవితంలో లక్ష్యం లేకుండా చదివితే ఉపయోగం ఉండదు, మీరు భవిష్యత్ లో ఏం అవ్వాలి అనుకుంటున్నారో, ఆ మార్గం గురించి పూర్తిగా తెలుసుకొని అడుగులు ఆ దిశగా వేయాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్య నుండే భవిష్యత్ లో ఏం అవ్వాలి అనేది ఒక ఆలోచన చేసుకోవాల్సిందిగా సూచించారు. అమ్మాయిలు ఆర్థిక స్వేచ్ఛను సాధించాకనే వివాహం గురించి ఆలోచన చేయవల్సినదిగా సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని,విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇంటర్ విద్య చాలా విలువైనది, నిర్లక్ష్యంతో చదవకండి, ప్రతిరోజు కాలేజ్ కి రాండి, ఎవరైతే గైర్హాజరు అవుతారో, ఆ



విద్యార్థిని వారి తల్లిదండ్రులను పిలిచి మరి కారణం తెలుసుకుంటాను అని తెలిపారు. మీ తల్లిదండ్రులు వచ్చి సంజాయిషీ ఇచ్చుకునేలా, వారు బాధపడేలా చేయకూడదు అని, నేను ప్రతీ నెల ఇలానే మీ విద్యాసంస్థను సందర్శిస్తాను అని తెలియజేసి, ప్రతీ ఒక విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలాషించి, ఇంటర్మీడియట్ డిగ్రీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి ఆశయాలను లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది పిల్లలు అడిగిన ప్రశ్నలకు సివిల్ సర్వీసు ప్రాముఖ్యత చదువు విలువ తదితర అంశాలపై క్లుప్తంగా కలెక్టర్ పిల్లలకు వివరించారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఏకాగ్రత పట్టుదల తో చదువులు అభ్యసించాలని కోరారు. అనంతరం కిచెన్ షెడ్ ను పరిశీలించి మెనో ప్రకారం సోమవారం చేసిన వంటలను పరిశీలించారు. కచ్చితంగా పక్క డైట్ మెనో ను పాటించాలని పిల్లలకు అందించే సౌకర్యాలలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అదనపు కలెక్టర్ పురుషోత్తం, ఎంపీడీవో క్రాంతి, ప్రిన్సిపాల్ సుజాత, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్, డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డా. శివ కుమార్, రాజకుమార్, స్వామి పూరషోత్తం పాల్గొన్నారు.

## 2027 చివరి నాటికి దేవాదుల పూర్తి

- పనుల వేగవంతానికి రూ.146 కోట్ల విడుదల
- దేవాదుల పంపులు 24 గంటలూ నడపాలి
- కాళేశ్వరం పనులు ఎన్‌డీఎస్ఏ మార్గదర్శకాల మేరకే
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, జూలై 13 (ప్రభాత గమనం): రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాగునీరు, సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరిలో ప్రవాహం ఉన్న ప్రతి సందర్భాన్ని సద్వినియోగం చేసుకుని ప్రాజెక్టులోని అన్ని పంపులను 24 గంటల పాటు నిరంతరం నిర్వహిస్తూ 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అనంతరం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ప్రాజెక్టు మూడో దశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గోదావరి నదిలో సుమారు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండటం తో ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించా రు. ప్ర స్తుతం ఏడు పంపులు పనిచేస్తుండగా, మొత్తం పది పంపులు పనిచేస్తే రోజుకు 0.23 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉంటుందని అధికారులు వివరించినట్లు తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంటనే రూ.146 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు.

## బాలికపై లైంగిక దాడి

- పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్
- పెళ్లి పేరుతో మోసం..బలవంతంగా గర్భస్రావం
- నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం : మామునూరు ఏసీపీ వెంకటేష్



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రేమ పేరుతో నమ్మించి ఒక మైనర్ బాలికపై వరుసగా లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, ఆమె గర్భం దాల్చడంతో బలవంతంగా గర్భస్రావం చేయించిన నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను మామునూరు ఏసీపీ వెంకటేష్ మీడియాకు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం..హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన బొడ్డు బన్నీ (21) అనే యువకుడికి, గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక బాలికతో 2023లో పదో తరగతి చదువుతున్న సమయంలో స్నేహితురాలి ద్వారా పరిచయం ఏర్పడింది. బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించిన నిందితుడు, ఆమెతో తరచూ ఫోన్లో మాట్లాడేవాడు. 2023 మార్చిలో SSC పరీక్షలు జరుగుతున్న సమయంలో ఒక రోజు రాత్రి బాలిక ఇంటికి వెళ్లిన బన్నీ, ఆమెను సమీపంలోని ఓ వెంచర్‌కు తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా నమ్మించి 2024 వరకు పలుమార్లు ఆమెపై లైంగిక దాడి కొనసాగించాడు.

### కేకులో గర్భస్రావ మాత్రలు కలిపి..

ఈ క్రమంలో 2025 మార్చిలో బాధిత బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం గమనించిన నిందితుడు, బాలిక పుట్టినరోజు నాడు ఆమెకు తెలియకుండా కేకులో గర్భస్రావానికి సంబంధించిన మాత్రలు కలిపి తినిపించాడు. ఆ తర్వాత తీవ్ర కడుపునొప్పితో బాధపడిన బాలికను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, గర్భస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం కూడా నిందితుడి వేధింపులు ఆగలేదు. తన వద్దకు రావాలని ఒత్తిడి చేయడం, రాకపోతే కొట్టడం, చంపేస్తానని బెదిరించడం చేశాడు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌లో బాలికపై దాడి చేసి, ఆమె మొబైల్ ఫోన్‌ను సైతం ధ్వంసం చేశాడు. నిందితుడి వేధింపులు భరించలేని బాధితురాలు గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నిందితుడు బొడ్డు బన్నీని అరెస్ట్ చేసి, అతనిపై 'భారతీయ న్యాయ సంహిత' మరియు 'పోక్సో' చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. "మైనర్లపై ఇలాంటి అఘాయిత్యాలకు, వేధింపులకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి నేరగాళ్లపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని మామునూరు ఏసీపీ వెంకటేష్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఏసీపీ వెంకటేష్‌తో పాటు గీసుకొండ ఇన్స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్సై కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పాల్గొని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, వివరాలను నిరంతరం అప్డేట్ చేయాలని తెలిపారు. వ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం మరియు సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.





Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLAGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374